క్లుప్తంగా

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కడెం: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన సందర్భంగా మండలంలోని పెత్తర్బ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నాయకులు, రైతులు జాడి ఆనంద్, గంగయ్య, విక్కి, వెంకటేశ్, భాస్కర్, శేఖర్ తదితరులు ఉన్నారు.

ఓటరు నమోదు ఇంటింటా సర్వే



ఇంటింటా సర్వే చేస్తున్న బీఎల్‌ఓలు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని 299, 300వ పోలింగ్ బూత్‌లో సోమవారం ఓటరు నమోదు ఇంటింటా సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటిని బీఎల్‌ఓలు సందర్శించి ఓటర్ల సంఖ్య, చిరునామా, ఫొటో, ఇతర వివరాలు నమోదు చేసుకున్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆర్‌ఐ వేణుగోపాల్, కంప్యూటర్ ఆపరేటర్ ఫిర్దోస్ తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిసా జయంతి



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

కుంటాల: కుంటాల శాంతినికేతన్ పాఠశాలలో సోమవారం మదర్ థెరిసా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చేసిన సేవలకు నోబెల్ శాంతి బహుమతి, భారతరత్న అందుకున్న మహానుభావురాలని ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్ కొనియాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలకు ఎంపిక

కుంటాల: తెలంగాణ క్రీడా పాఠశాల ఎంపిక పరీక్షలు (శరీర ధారుడ్య) ఐదో తరగతి ప్రవేశం కోసం ఈనెల 8న అర్హత పరీక్షలు నిర్వహించారు. స్థానిక సృజన విద్యానిలయం పాఠశాలకు చెందిన పి.అశ్విన్, పి.జైపాల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి ములుగు జిల్లాలోని ఇతూర్‌నగరం బాలుర క్రీడా పాఠశాలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ కొత్తకాపు గంగన్న, పీఈటీ నవీన్ వారిని అభినందించారు.

కుంటను శుభ్రం చేయాలని ఆందోళన

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలోని అపరిశుభ్రంగా ఉన్న బొడ్డోని కుంటను శుభ్రం చేయాలని కోరుతూ కాలనీవాసులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలుకాలనీల్లోని డ్రెయినేజీల నీరు కుంటలోకి చేరడంతో దుర్వాసన వస్తుందన్నారు. పలువురు వ్యాపారులు కుంటలోకి వ్యర్థాలు పడేస్తున్నారని తెలిపారు. మురుగునీటితో దోమలు వృద్ధి చెంది ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: విశ్వనాథ్‌పేట్ సబ్‌స్టేషన్‌లో ఎల్వీ బ్రేక్ మరమ్మతు దృష్ట్యా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ రవి ఓ ప్రకటనలో తెలిపారు. అగ్రికల్చర్ మార్కెట్, మోచి గల్లీ, బుధవారపేట్, గాంధీచౌక్, కబుతార్ కమాన్, బంగల్‌పేట్, నాయుడు వాడ, బోయవాడ, రామ్‌రావుభాగ్ సాయిబాబా టెంపుల్, విశ్వనాథ్‌పేట్, వైఎస్‌ఆర్ కాలనీ, గాజులపేట్, డాక్టర్స్ లైన్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

లోకేశ్వరం: మండలంలోని దుర్గానగర్ తండాలో నిరుపేద అయిన లక్ష్మి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. మా అమ్మ–నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబ సభ్యులకు సోమవారం రూ.13500ల విలువ చేసే బియ్యం, దుస్తులు, నిత్యావసర సరుకులను అందజేశారు. ఆంజనేయులు, సుమిత్‌కుమార్, క్షేమ, బలిరాం తదితరులు ఉన్నారు.

విషజ్వరాలు బాబోయ్..

- గ్రామాలను వణికిస్తున్న జ్వరాలు
- తాజాగా చించోలి(బి)లో ఒకరు మృతి
- మంచం పడుతున్న ఇంటికి ఇద్దరు, ముగ్గురు
- ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు



సాయినగర్ తండాకు చెందిన అరుణాబాయికి గత 18రోజుల క్రితం జ్వరం వచ్చింది. సారంగాపూర్, నిర్మల్ ఆసుపత్రులకు వెళ్లి చికిత్స తీసుకున్నా నయం కాలేదు. భరించలేని నొప్పులతో మంచానికే పరిమితమైంది. ఆమె బంధువులకు కబురు చేస్తే వచ్చి సేవలు చేశారు. వారికి జ్వరం, ఒళ్లు నొప్పులు వచ్చాయి. నొప్పులతో నరకం కనిపిస్తోంది.

సారంగాపూర్: గ్రామాలను విషజ్వరాలు వణికిస్తున్నాయి. చికున్‌గున్యా, డెంగీ జ్వరాలతో ఇంటికి ఇద్దరు, ముగ్గురు చొప్పున మంచం పట్టారు. తాజాగా చించోలి(బి) గ్రామానికి చెందిన సల్మాన్ (18) జ్వరంతో బాధపడుతూ ఆదివారం నిర్మల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో మృతిచెందాడు. దీంతో గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని జామ్, బోరిగాం, సాయినగర్, నాగాపూర్, చర్చితండా, ధని, చించోలి(బి), స్వర్ణ, మలక్‌చించోలి, వంజర్, తాండ్ర(జి), కంకెట, హనుమాన్‌తండా, లక్ష్మీనగర్, బోరింగ్‌తండా, గోపాల్‌పేట్, కుప్టి, రాంసింగ్ తండా, మహవీర్‌తండా తదితర గ్రామాల్లో విషజ్వరాల తీవ్రత ఉంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో జ్వరపీడితులు చికిత్స పొందుతున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తం..

సర్పంచుల పదవీకాలం ముగిశాక.. పంచాయతీల పాలన పగ్గాలు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకాధికారులకు అప్పగించింది. అయినా కొన్ని గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడ చూసినా ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. ఇళ్ల మధ్యలో పెంటకుప్పలు, రోడ్లపై మురుగు, వర్షపు నీరు నిలిచి దోమలు, ఈగలకు ఆవాసాలుగా మారుతున్నాయి. వివిధ గ్రామాల్లో కార్యదర్శులు సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జి కార్యదర్శులు బాధ్యతలు చేపడుతున్నారు. అయితే తమ గ్రామ పంచాయతీల్లో పనులు చక్కబెడుతూనే ఇన్‌చార్జిగా అదనపు భారమైంది. దీంతో పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ పెట్టడం లేదని గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు.

చించోలి(బి)లో వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ వేదవ్యాస్

చించోలి(బి) గ్రామంలో వైద్యాధికారి వేదవ్యాస్ ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. జ్వర పీడితులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. జ్వరాల తీవ్రత అధికంగా ఉన్నవారిని గుర్తించి స్థానిక పీహెచ్‌సీలో వైద్యపరీక్షల నిమిత్తం రెఫర్ చేశారు. మరికొందరిని నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి పంపించారు. ఈసందర్భంగా వేదవ్యాస్ మాట్లాడుతూ సారంగాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డెంగీ, విషజ్వరాలు, చికున్ గున్యా జ్వరాలకు రక్త పరీక్షలు చేస్తారని తెలిపారు. జ్వరాల తీవ్రతను బట్టి ఖరీదైన ఎలీసా పరీక్షలు చేసి మందులు అందిస్తామన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణమోహన్‌గౌడ్, శ్రీనివాస్, ప్రేంసింగ్, ఏఎన్‌ఎంలు రాధ, గంగ, ఆశకార్యకర్తలు ఉన్నారు.

లేవలేను..నడవలేను



వారం క్రితం చికున్‌గున్యా వచ్చింది. ఇప్పటివరకు మంచం నుంచి లేచి నడవలేదు. ఆకలి లేదు. కీళ్ల వాపువచ్చి నొప్పి వస్తుంది. కుటుంబసభ్యులు ఆటోలో నిర్మల్‌కు తీసుకెళ్లి ప్రైవేటు ఆసుపత్రిలో చూపించారు. రూ.15 వేలు ఖర్చయినా నొప్పి తగ్గలేదు. ఇతర ఆస్పత్రులకు వెళ్లినా నయం కాలేదు. అధికారులు గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయించాలి.

– రుకాబాయి, నాగాపూర్ తండా

అందుబాటులో పరీక్షలు

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో డెంగీ, చికున్‌గున్యా, వైరల్ జ్వరాల రక్తపరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రతీరోజు పీహెచ్‌సీలో 100 నుంచి 150 మంది ఓపీ చూస్తున్నాం. గ్రామాల్లో సైతం వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. చించోలి(బి)లో నిర్వహించాం. వైద్యసిబ్బంది నిత్యం ఫీవర్ సర్వే చేపడుతున్నారు.

– డాక్టర్ వేదవ్యాస్, పీహెచ్‌సీ, సారంగాపూర్

పంటల రక్షణకు పాట్లు

- అడవి జంతువుల దాడిలో పంటలు ధ్వంసం
- కంకులు తినిపారేస్తున్న కోతుల గుంపు
- నష్టపోతున్న రైతులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న యువ రైతు పోతుగంటి ప్రసాద్. ఈయన స్వగ్రామం లక్ష్మణచాంద మండలం పొట్టపెల్లి(కే). ఎకరంన్నరలో మొక్కజొన్న పంట సాగు చేశాడు. కోతులు, అడవి జంతువులు దాడిలో పంట ధ్వంసం కావడంతో లబోదిబోమంటున్నాడు. మండలంలో మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులందరిది ఇదే పరిస్థితి.



లక్ష్మణచాంద సమీపంలో అడవి పందుల దాడిలో ధ్వంసమైన మొక్కజొన్న

లక్ష్మణచాంద: వానాకాలం సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న, సోయాబీన్ పంటలపై అడవి జంతువులు, కోతులు దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయి. పంటలను రక్షించుకోవడానికి వారు అనేక పాట్లు పడుతున్నారు. వాటి బారి నుంచి పంటలు కాపాడుకునేందుకు చేసినా ప్రయత్నాలు ఫలించలేదు. పదుల సంఖ్యలో గుంపులుగా చేన్లపై దాడి చేసి నాశనం చేస్తున్నాయి. కోతులు కంకులను తెంపి సగం తిని పారేయడంతో రైతులకు తీరని నష్టాన్ని మిగులుస్తున్నాయి. మండలంలో గ్రామాల రైతులు తాము సాగు చేస్తున్న పంటల చుట్టూ కొందరు పాత చీరలను కంచెలుగా, మరికొందరు దారాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇంకొందరు ఇనుప వైర్లు ఏర్పాటు చేశారు. అయినా అడవి జంతువులు, కోతులు గుంపులుగా వచ్చి దాడి చేయడంతో పంటలు దెబ్బతింటున్నాయి. రాత్రిసమయంలో రైతులు మొక్కజొన్న పంట వద్ద కాపాలా ఉండాల్సి వస్తోంది. నిద్ర లేక ఆరోగ్యం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు చేపట్టాలి



మొక్కజొన్న పంటలపై అడవి పందులు, కోతుల దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయి. గుంపులుగా వచ్చి కంకులకు తినేస్తున్నాయి. పంటలకు తీవ్ర నష్టం కలుగుతుంది. వాటి బెడద తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

– గోపి, రైతు, పీచర

నష్టపరిహారం చెల్లించాలి



అడవి జంతువుల దాడిలో పంటలు దెబ్బతింటున్నాయి. ఆర్థికంగా నష్టపోతున్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి. అడవి జంతువులు, కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలి.

– జగదీశ్‌రెడ్డి, రైతు, పొట్టపెల్లి

నష్టపోయిన రైతులు సంప్రదించాలి

అడవి జంతువుల దాడిలో పంటలు నష్టపోయిన రైతులు తనను సంప్రదించాలి. పంటల వద్దకు సిబ్బందిని పంపి ఏఈవోలతో పంచనామా నిర్వహిస్తాం. పంట ఎంత నష్టం జరిగిందో తెలుసుకుని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్ ఎఫ్‌ఆర్‌వో, దిమ్మదుర్తి

ఆలయాల్లో భక్తుల సందడి



భైంసారూరల్: సిరాల శివాలయంలో క్యూలైన్‌లో భక్తులు

భైంసారూరల్/కుభీర్/కుంటాల/తానూరు: శ్రావణమాసం చివరి సోమవారంతో జిల్లాలోని ఆలయాలు భక్తులతో సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చి పూజలు నిర్వహించారు. పలుచోట్ల అన్నదానం చేపట్టారు. భైంసా మండలం సిరాల గ్రామంలో జోడు శివలింగాలను దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్‌లో ఉన్నారు. కుంటాల మండలంలోని శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రావుపటేల్ పూజలు చేసి మొక్కు చెల్లించుకున్నారు. కుభీర్‌లోని మల్లేశ్వర్ గుట్ట, శివాలయం, తానూరు మండలం బోరిగాం సమీపంలోని మహాదేవున్ని ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించి మొక్కు చెల్లించుకున్నారు. మహాదేవున్ని ఆలయ అభివృద్ధికి కృషిచేస్తామని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావ్ పటేల్ అన్నారు. ఆలయానికి చేరుకుని సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. నాయకులు చంద్రకాంత్ యాదవ్, గోవింద్‌రావ్ పటేల్, సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

శాంతియుతంగా పండుగ జరుపుకోవాలి

- ఎమ్మెల్యే రామారావుపాటిల్



విజేతకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే

ముధోల్: ఐక్యంగా ఉండి పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే రామారావుపాటిల్ అన్నారు. మండల కేంద్రంలోని పశుపతినాథ్ ఆలయం వద్ద హిందువాహిని ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ప్రథమ బహుమతి గెలుపొందిన మహారాష్ట్రలోని పరబాని జట్టుకు రూ. 21,111, ద్వితీయస్థానంలో నిలిచిన హైదరాబాద్ జట్టుకు రూ. 11,111లను ఎమ్మెల్యే అందజేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్నాభావు సాఠే ఆదర్శనీయుడు

భైంసాటౌన్: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాఠే ప్రతి ఒక్కరికి ఆదర్శనీయుడని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. పట్టణంలోని అన్నాబావు సాఠే భవనం వద్ద సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏఎంసీ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేశ్‌బాబు, మాజీ ఎంపీపీ అబ్దుల్‌రజాక్, బీఆర్‌ఎస్ నాయకులు లోలం శ్యాంసుందర్, బీజేపీ నాయకులు రమేశ్, పండిత్‌రావు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

సన్మానం

లక్ష్మణచాంద: ఇన్‌చార్జి ఏవో వసంత్‌రావు, ఏఈవో మౌనిక, బదిలీపై వెళ్లిన ఏవో ప్రవీణ్ కుమార్, ఏఈవో సంతోష్ కుమార్‌ను నర్సాపూర్ (డబ్ల్యూ) రైతులు, నాయకులు సోమవారం సన్మానించారు. రైతులు, నాయకులు జీవన్ రెడ్డి, రేణి మల్లేష్, హుస్సేన్, రాములు పాల్గొన్నారు.

గురుకుల పీఈటీ ఫలితాల్లో సత్తా

కుంటాల:ఇటీవల వెలువడిన గురుకుల పీఈటీ ఫలితాల్లో కుంటాలకు చెందిన ఎనుగందుల సాగర్, శ్రీకాంత్ సత్తాచాటి ఉద్యోగాలు సాధించారు. గ్రామస్తులు సోమవారం వారిని సన్మానించారు. మాజీ ఎంపీపీ అప్క గజ్జారాంతోపాటు వెంకట్‌రావు, గొల్లపెద్ద గజ్జారాం, దేవేందర్, పల్లికొండ గజేందర్, రమణారావు, మహేందర్, గోవర్ధన్, శ్రీనివాస్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

సిలబస్‌ను అర్థం చేసుకోవాలి

నిర్మల్‌రూరల్: పోటీ పరీక్షల్లో రాణించాలంటే విద్యార్థులు సిలబస్‌ను అర్థం చేసుకుని చదవాలని విద్యావేత్త, పోటీ పరీక్షల విశ్లేషకుడు ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ సూచించారు. జిల్లా గ్రంథాలయంలో సోమవారం పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం స్టడీ మెటీరియల్ అందజేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు కటకం మురళీ, రవికుమార్, మధు, తెలంగాణ జూనియర్ లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి జాదవ్ బలరాం, పోటీ పరీక్షల నిపుణుడు రమణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్(జి)లో..



భైంసాటౌన్: కిసాన్‌గల్లి శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో..

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

భైంసాటౌన్/తానూరు/కుభీర్/నర్సాపూర్(జి)/లక్ష్మణచాంద/నిర్మల్‌చైన్‌గేట్/లోకేశ్వరం/ముధోల్/కుంటాల/ఖానాపూర్/ సారంగపూర్/నిర్మల్‌రూరల్/పెంబి: జిల్లావ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల్లో జరిగిన వేడుకల్లో చిన్నారులు కృష్ణుడి, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. హిందూఉత్సవ సమితి ఆధ్వర్యంలో భైంసాలోని కిసాన్‌గల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రామారావు పటేల్ పాల్గొన్నారు.



భైంసాటైన్: గుజిరిగల్లి శ్రీ సరస్వతిశిశుమందిర్‌లో



కుభీర్: శ్రీసరస్వతీ శిశుమందిరంలో..



లోకేశ్వరం స్వాధ్యాయ కేంద్రంలో..



పెంబిలో..



సారంగపూర్: వింధ్యా స్కూల్‌లో..



నిర్మల్‌చైన్‌గేట్: వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినిలు



తానూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో..



ముధోల్‌లో..



భైంసాటౌన్: రాధాకృష్ణుల వేషధారణలో..

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన పుస్పూర్ విద్యార్థులు వీరే

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్, రాజు, సిద్ధార్థ, కౌషిక్, ఈశ్వర్, మహేశ్, నందకిశోర్, శశివంత్ ఇటీవల నిర్మల్‌లో నిర్వహించిన అండర్–16 క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. సోమవారం పుస్పూర్ గ్రామంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సన్మానించారు. ఇందుకు కృషి చేసిన కోచ్ రాజశేఖర్‌ను అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంగెం నర్సన్న, అసిసెంట్ కోచ్ రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.